
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

వరంగల్ fb.com/vaartha

Published from Warangal, Karimnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

11-12-2024 బుధవారం సంపుటి: 30 సంచిక: 313 పేజీలు: 8+16 వెల: 6.50

కర్ణాటక మాజీ సిఎం ఎస్ఎం కృష్ణ కన్నుమూత 5

కుటుంబ సభ్యులతో జైపూర్ వెళ్లిన సిఎం రేవంత్ 7

# పోడు సాగుకు 'సోలార్'

## ప్రతి వ్యవసాయ పంపుసెట్‌కు విద్యుత్

### ఎన్ని ఇబ్బందులు వచ్చినా ప్రజావాణి కొనసాగిస్తాం

### పరిష్కారాల పట్ల ప్రజలు సంతృప్తితో ఉన్నారు: ఉప ముఖ్యమంత్రి భట్టి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబరు10:** ఫారెస్ట్ రైట్ యాక్ట్ ద్వారా పట్టాలు పొందిన పోడు రైతులు సాగు చేసుకోవ డానికి సోలార్ ద్వారా ప్రతి వ్యవసాయం పంపు సెట్ కు కరెంటు అందించడానికి చర్యలు తీసుకుంటామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ప్రజావాణి ఏడాది పూర్తయిన సందర్భంగా మంగళవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో లబ్ధిదారులతో డిప్యూటీ సిఎం సమావేశం నిర్వహించారు. పోడు రైతులు సోలార్ పవర్ పెట్టుకోవడానికి కావలసిన ఏర్పాట్లు చేయాలని గిరిజన సంక్షేమశాఖకు ఆదేశాలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ప్రజల అవసరాలు వారి ఇబ్బందులను నేరుగా చెప్పుకోవడానికి ప్రజా ప్రభుత్వం ప్రజావాణిని ఏర్పాటు చేసిందన్నారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా ప్రజావాణి కార్యక్రమాన్ని నిరంతరంగా కొనసాగిస్తామని వెల్లడించారు. ఏడాది పూర్తి చేసుకున్న ప్రజా ప్రభుత్వంలో నిర్వ హించిన ప్రజావాణిలో పెట్టుకున్న దరఖాస్తులకు పరిష్కారం లభించిందని లబ్ధిదారులు సంతోషాన్ని వ్యక్తం చేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రజా ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా ప్రజల అవసరాలు తీర్చడం కోసం పనిచేస్తున్నదని ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును కంప్యూటరైజ్ చేసి సంబంధిత అధికారులకు ఆ దరఖాస్తులను పంపించి, ఆ సమస్య పరిష్కారం కోసం సంబంధిత అధికారి తీసుకున్న నిర్ణయాలను ప్రజలకు చెప్పే విధంగా నిరంత రాయంగా పర్యవేక్షణ చేయడంవల్ల దరఖాస్తుదారులు సంతోషాన్ని వెలిబుచ్చుతున్నారని వివరించారు. ప్రభుత్వంలో ఉన్న అన్ని వ్యవస్థలు ప్రజల కోసమే పని చేస్తూ ప్రజాస్వామ్యానికి పునాదులు వేస్తున్నాయని పేర్కొన్నారు. దేశంలో నిజమైన ప్రజాస్వామ్యాన్ని అందించాలనే రాహుల్ గాంధీ ఆలోచన విధానానికి అనుగుణంగా, భారత రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రియాంబుల్స్, చట్టాలను తూచా తప్పకుండా ప్రజలకు అందించాల్సిన బాధ్యతతో ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం ముందుకు పోతున్నదని అన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెడుతూ వారి అవసరాలు తీర్చడం కోసం తెచ్చుకున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రజల ఆశలు ఆకాంక్షలు నెరవేర్చకపోగా 70 సంవత్సరాలు వెనక్కి తీసుకెళ్లిందని విమర్శించారు, భావ స్వేచ్ఛ, ప్రగతిశీల ఆలోచనలకు స్థానం లేకుండా గుప్పిట్లో బంధించి పాలన అందించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వచ్చిన అటవీ హక్కుల చట్టాన్ని పూర్తిగా తుంగలో తొక్కడమే కాకుండా పోడు రైతుల సమస్యలను గత బిఆర్ఎస్ పాలకులు పట్టించుకోలేదన్నారు. ఇందిరమ్మ రాజ్యం వస్తే తప్ప మన ఆశలు ఆకాంక్షలు నెరవేరవని >>2

## రాజ్యసభ ఛైర్మన్‌పై అవిశ్వాసం నోటీసు



### ఇండియా కూటమి పార్టీల్లో 50 మందిపైగా సంతకాలు

### బాధకరమే.. తప్పడం లేదు: జైరామ్ రమేష్

**న్యూఢిల్లీ, డిసెంబరు 10:** కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి రాజ్యసభ ఛైర్మన్ జగదీప్‌ధన్‌కర్‌పై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టింది. ఛైర్మన్‌పైఇచ్చిన అవిశ్వాసం నోటీసుపై 50మందికిపైగా సంతకాలు చేసారు. కాంగ్రెస్, బెంగాల్ టిఎంసి, ఆమ్ ఆద్మీపార్టీ అరవింద్‌కేజ్రీవాల్, అఖిలేష్‌యాదవ్ సమాజ్‌వాది పార్టీ, తమిళనాడు డిఎంకె, ఆర్జెడిలకు చెందిన ఎంపిలు సంతకాలుచేసిన నోటీసును రాజ్యసభ సెక్రటేరియట్‌కు పంపించారు. ఇండియా కూటమిలోని అన్ని పార్టీలకు మరో ప్రత్యామ్నాయం లేకనే నోటీసు ఇవ్వాల్సి వచ్చిందని కాంగ్రెస్‌ప్రధాన కార్యదర్శి జైరామ్‌రమేష్ అన్నారు. ఈ నిర్ణయం ఎంతో బాధాకరమే అయినా కూడా తప్పనిపరిస్థితుల్లో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పరిరక్షణకోసం ఈ చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని ఆయన అన్నారు. టిఎంసి ఎంపి సాగరికఘోష్ మాట్లాడుతూ పార్లమెంటును ప్రస్తుత ప్రభుత్వం ఖూనీచేస్తోందని, పార్లమెంటరీ ప్రజాస్వామ్య పరిరక్షణకోసమే అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇవ్వాల్సి వచ్చిందని అన్నారు. అయితే ప్రతిపక్షానికి తగినంతమంది సభ్యులు లేరని టిఎంసి వర్గీయులు చెపుతున్నారు. లోక్‌సభలో వలే కాకుండా ఇక్కడ అంతమంది లేరని, >>2



## నేటి నుంచి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు శిక్షణ

### హాజరు కానున్న సిఎం రేవంత్, డి. సిఎం, మంత్రులు

### ఏర్పాట్లు పరిశీలించిన స్పీకర్, ఛైర్మన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు10:** తెలంగాణ రాష్ట్ర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు 11,12వ తేదీలలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు జూబ్లిహిల్స్‌లోని మర్రి చెన్నారెడ్డి హెచ్ఆర్‌డి ఇనిస్టిట్యూట్‌లో ఈ శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ శిక్షణకు హాజరు కావాల్సిందిగా ఎమ్మెల్సీలకు శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ లేఖలు రాశారు. డిసెంబర్ 11, 12 తేదీలలో తెలంగాణ రాష్ట్ర శాసనసభ మరియు శాసన పరిషత్తు సభ్యులకు ఏర్పాటు చేసిన ఓరియెంటేషన్ ప్రోగ్రాం ఏర్పాట్లను మంగళవారం సాయంత్రం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, >>2

## పాఠ్యపుస్తకాల్లోకి తెలంగాణ తల్లి!

### రాష్ట్ర గీతంగా జయహే జయ తెలంగాణ

### వచ్చే యేడాది నుంచి అమలు

### పుస్తకాల ముద్రణపై అధికారుల కసరత్తు



**హైదరాబాద్, డిసెంబరు 10, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు పాఠ్యపుస్తకాల్లో వచ్చే ఏడాది నుంచి తెలంగాణ తల్లి ఫోటోతోపాటు.. రాష్ట్ర గీతంగా జయహే జయ తెలంగాణ గీతాన్ని చేర్చనున్నారు. ఇందుకు సంబంధించిన నిర్ణయం తీసుకున్నట్టు పాఠశాల విద్య డైరక్టర్ ఈవీ నరసింహారెడ్డి మంగళవారం తనను కలిసిన విలేకరులకు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహాన్ని సోమవారం సచివాలయంలో ప్రారంభించిన సంగతి తెలిసిందే. తెలంగాణ తల్లి విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది 2025-26 విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలోని ఉచిత పాఠ్య పుస్తకాలతోపాటు, సేల్ కాంపోనెట్ పుస్తకాల్లోనూ తెలంగాణ తల్లి ఫోటోతోపాటు రాష్ట్ర గీతంగా జయహే జయ తెలంగాణను చేర్చనున్నారు. దీంతో వచ్చే ఏడాది నుంచి 1 నుంచి 10వ తరగతి వరకు ఉండే అన్ని పాఠ్యపుస్తకాల్లో తెలంగాణ తల్లి ఫోటోను పెట్టనున్నారు. అలాగే రాష్ట్ర గీతంగా ఇప్పటికే అధికారికంగా జయహే జయ తెలంగాణ గీతాన్ని ప్రకటించడంతో.. అదే గీతాన్ని పాఠ్యపుస్తకాల్లో చేర్చనున్నారు. అయితే ఇకపై రాబోయే ఏడాదిలో ముద్రించనున్న పాఠ్యపుస్తకాల్లో వీటిని అమలు చేయడం కోసం పాఠశాల విద్య డైరక్టర్ అందుకు సంబంధించిన ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటు చేయనున్నారు. నేడు ఎస్‌సీఈఆర్‌టీ అధికారులు సమావేశమై.. పాఠ్యపుస్తకాల ముద్రణపై నిర్ణయం తీసుకోనున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి పాఠ్యపుస్తకాల ముద్రణ పూర్తి కావల్సి ఉన్నందున.. అధికారులతో సమావేశాలు నిర్వహించి పాఠ్యపుస్తకాల ముద్రణను పూర్తి చేయాల్సి ఉంటుంది. త్వరలోనే ఇందుకు సంబంధించిన వివరాలను ప్రభుత్వ పుస్తక ముద్రణాలయంకి అలాగే తెలుగు అకాడమీకి కూడా ఇవ్వాల్సి ఉంటుంది. వచ్చే ఏడాది నుంచి పాఠశాల విద్యలో పాఠ్యపుస్తకాల్లో తెలంగాణ తల్లి ఫోటోతోపాటు, రాష్ట్ర గీతంగా జయహే జయ తెలంగాణ గీతాన్ని చేర్చనున్న నేపథ్యంలో ఇంటర్, డిగ్రీ, పీజీతోపాటు ఇతర ఉన్నతస్థాయి కోర్సుల్లోనూ దీనిని చేర్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. గత ప్రభుత్వం తెలంగాణ తల్లి ఫోటోను పాఠ్యపుస్తకాల్లో ముద్రించ లేదు.. పైగా రాష్ట్ర గీతాన్ని సైతం ముద్రించని విషయం తెలిసిందే.

# వీధికెక్కిన 'మంచు' జగడం

### మోహన్‌బాబు, మనోజ్‌లపై కేసులు నమోదు

### నేడు తమ ఎదుట హాజరు కావాలని మోహన్‌బాబుకు రాచకొండ పోలీసుల ఆదేశం

### జల్‌పల్లిలోని ఫామ్‌హౌస్ వద్ద సడలని ఉద్రిక్తత

### తుపాకులు సరెండర్ చేయాలని మోహన్, విష్ణుకు సిటీ పోలీసుల ఆదేశం



జడ్‌పల్లి ఫాంహౌస్ గేటు వద్ద మంచు మనోజ్, తదితరులు



ఆగ్రహంతో మోహన్‌బాబు

**హైదరాబాద్, (సరూర్‌నగర్) డిసెంబరు 10, ప్రభాతవార్త:** టాలీవుడ్ సీనియర్ నటుడు మోహన్ బాబు ఇంట్లో ఏర్పడ్డ గొడవలు మరింత ముదిరాయి. సోమవారం వ రకు పోలీసుల ఫిర్యాదుల వరకే పరిమితమైన మోహన్ బాబు ఆయన తనయుడు మనోజ్‌లు మంగళవారం వీధి పోరాటానికి దిగారు. శివార్లలోని జల్‌పల్లిలో గల మో హన్ బాబు ఫాం హౌజ్‌లో రెండు రోజులుగా >>2

## మీడియా ప్రతినిధులపై మోహన్‌బాబు దాడి

### ఫాంహౌస్ వద్ద కవరేజీలో ఉన్న వారిపై రెచ్చిపోయిన మోహన్‌బాబు, బౌన్సర్లు

**సరూర్‌నగర్, డిసెంబరు 10 ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర శివార్లలోని పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ప్రముఖ సినీ నటుడు,నిర్మాత మంచు మోహన్‌బాబు ఫాంహౌస్ వద్ద జరుగుతున్న పరిణామాలపై కవరేజీకి వెళ్ళిన మీడియా ప్రతినిధులపై దాడి జరిగింది. గత రెండు రోజులుగా మోహన్‌బాబు కుటుంబంలో గొడవలు జరుగుతుండడం.. ఆయన రెండవ కుమారుడు మంచు మనోజ్, కోడలు మౌనికారెడ్డిలు సోమవారం సాయంత్రం పహాడీషరీఫ్ పిఎస్‌లో ఫిర్యాదు చేయడం..అది జరిగిన కొద్ది సేపటికే మోహన్‌బాబు సైతం రాచకొండ పోలీస్ కమీషనర్‌కు తన కొడుకు, కోడలుపై ఫిర్యాదు లేఖను పంపడం ప్రాధాన్యత సంతరించుకుంది. సెలబ్రిటీ కుటుంబం కావడంతో ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా ప్రతినిధులు మంచు ఫాంహౌస్ వద్ద విధులు నిర్వహిస్తూ వార్తల కవరేజీలు >>2

## ఆసుపత్రిలో చేరిన మోహన్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబరు10:** ప్రముఖ సినీ నటుడు మోహన్‌బాబు స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. మంగళవారం రాత్రి 9.30 గంటల సమయంలో గచ్చిబౌలి కాంటినెంట్ ఆసుపత్రిలో చేరారు. ప్రస్తుతం మోహన్‌బాబు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఇంట్లో తోపులాటతో మోహన్‌బాబు కింద పడ్డారు. ఆయనకి బీపీ పెరిగింది. దీంతో ఆయనను మంచు విష్ణు ఆసుపత్రికి తీసుకొచ్చారు. మోహన్‌బాబు మీడియాపై దాడి చేశారంటూ జర్నలిస్టు సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. తక్షణమే మీడియాకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## ఎన్‌హెచ్ 30పై కారు దగ్ధం

### పోలీసుల బలగాలు హై అలర్ట్

### ముగిసిన మావోయిస్టు వారోత్సవాలు



దగ్ధమవుతున్న కారు

**చింతూరు డిశంబర్ 10 ప్రభాతవార్త:** చింతూరు మండలం సర్వేల గ్రామం సమీపంలో మావోయిస్టు మంగళవారం తెల్లవారుజామున కారును దగ్ధం చేశారు.అయితె కారులో ఉన్న వ్యక్తులను మావోయిస్టులు అపహరించారా?లేక భయంతో పారిపోయారా?తెలియాల్సి ఉంది. డిశంబర్ 2నుండి 8వరకు మావోయిస్టుల వారోత్సవాలు ఉండటంతో ఎటువంటి అవాంచనీయ >>7



## పాదచారులపైకి 'బెస్ట్' బస్

### ఏడుగురు మృతి, 43 మందికిపైగా తీవ్ర గాయాలు

**ముంబయి, డిసెంబరు 10:** నగరంలోని ప్రజారావాణా సంస్థకు చెందిన బెస్ట్ బస్ ఒకటి పాదచారులపైకి దూసుకుపోవడంతో ఏడుగురు ప్రయాణీకులు చనిపోగా 40 మందికిపైగా తీవ్ర గాయాలపాలయినట్లు పోలీసులు వెల్లడించారు. ముంబయి సివిక్ ట్రాన్స్‌పోర్ట్ బస్ కుర్లా రైల్వేస్టేషన్ సమీపంలో అదుపుతప్పి పాదచారులపైకి దూసుకుపోయింది. డ్రైవర్‌కు విద్యుత్ బస్‌పై తగినంత శిక్షణ లేదని, దీనికితోడు బస్సు స్టీరింగ్ అదుపు తప్పడంతోప్రమాదానికి లోనయినట్లు పోలీసులు తెలిపారు. పాదచారులతోపాటు అనేక వాహనాలు కూడా ధ్వంసంఅయ్యాయి.విద్యుత్ బస్సుపై వేగం దానంతట అదే పెరిగిపోయిందని, దీనితో డ్రైవర్ అదుపు తప్పిందని పోలీసులు తెలిపారు. బస్సు డ్రైవర్ సంజయ్ మోరేను అరెస్టుచేసి రవాణాశాఖ; బిఎన్ఎస్‌కింద వివిధ సెక్షన్లతో కేసులు నమోదు చేసారు. >>2

# మార్కెట్ టెండర్లలో కాంట్రాక్టర్ల 'రింగ్'



### ప్రభుత్వంపై రూ.7కోట్ల అదనపు భారం

### రూ.153.5కోట్ల టెండర్లలో చక్రం తిప్పిన ఉన్నతాధికారి

### ఆన్‌లైన్ టెండర్లలోనూ పచ్చి మోసం!

**ఖమ్మం బ్యూరో, ప్రభాతవార్త:** మార్కెట్ యార్డు ఆన్‌లైన్ టెండర్లలోనూ అక్రమాలకు తెరలేపి ప్రభుత్వంపై రూ.7కోట్ల అదనపు భారాన్ని మోపారు. రూ.153.5కోట్ల ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఆన్‌లైన్ టెండర్లలో ఆ శాఖకు చెందిన ఓ ఉన్నతాధికారి చక్రం తిప్పి తనకు అనుకూలమైన గుత్తేదారుకు కాంట్రాక్టు లభించేలా గుట్టు చప్పుడు కాకుండా కథ నడిపించారు. రాష్ట్ర రాజధాని హైద్రాబాద్‌లోని మార్కెటింగ్‌శాఖ కార్యాలయంలోని సోమవారం సాయంత్రం జరిగిన ఈ ఆన్‌లైన్ కాంట్రాక్టు వేలంలో సూత్రదారి పాత్రదారి ఆశాఖలో కీలకపాత్ర నిర్వహిస్తున్న ఓ ఇంజనీరే కావడం గమనార్హం. పారదర్శకంగా పనులను కాంట్రాక్టర్లకు అప్పగించేందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. దీని ద్వారా ఆన్‌లైన్‌లో ఏ ప్రాంతంలో ఉన్న కాంట్రాక్టరు అయిన రేట్లను కాంట్రాక్టు కోడ్ చేసుకునే అవకాశం ఉంది. ఈ వేలంలో పాల్గొనడానికి కాంట్రాక్టర్లు అధిక మొత్తంలో ముందుకు వచ్చినప్పటికి మార్కెటింగ్ శాఖలోని ఉన్నతాధికారే చక్రం తిప్పడంతో తోటి కాంట్రాక్టర్లు ఎవరూ వేలంలో పాల్గొనలేదు. కేవలం ఇరువురు కాంట్రాక్టర్లు మాత్రమే వేలంలో పాల్గొన్నారు. ఇందులో ఒక కాంట్రాక్టర్ 4.6శాతం అధిక రేటును కోడ్ చేయగా మరో కాంట్రాక్టరు నిబంధనలు పాటించకుండా టెండరు వేశారు. దీంతో ఒక పథకం ప్రకారం జరిగిన ఒప్పందంలో నిబంధనలు పాటించని కాంట్రాక్టర్‌ను తిరస్కరించి 4.6శాతం అధిక రేటును కోడ్ చేసిన కాంట్రాక్టర్‌కే పనులు దక్కేలా చేశారు. దీంతో ప్రభుత్వంపై అదనపుభారం పడనుంది. మొదట తనకున్న చతరుతతో మార్కెట్ యార్డ్ డిపిఆర్ తయారు చేసే సమయంలో అధిక రేటుతో రూపొందించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు టెండర్లలో టెండరు ప్రక్రియలో అధికంగా రేటును నిర్ణయించిన కాంట్రాక్టర్‌కే పనులు లభించేలా చేయడంతో ప్రభుత్వంపై పరోక్షంగా కోట్లాది రూపాయల అధిక భారం పడనుంది. రాష్ట్రంలోని పురాతన ప్రధాన మార్కెట్లలో ఒకటైనా ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు అధునాతన సొబగులు >>2



## 17 నుంచి 5 రోజులు రాష్ట్రపతి ముర్ము ఇక్కడే

### విస్తృత ఏర్పాట్లపై సిఎస్ శాంతి కుమారి సమీక్ష

**హైదరాబాద్, డిసెంబరు 10 ప్రభాతవార్త:** తెలంగాణలో రాష్ట్రపతి ఐదు రోజులు పాటు పర్యటించనున్నారని అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. ఈ నెల 17 నుండి ఐదు రోజుల పాటు పర్యటన నేపథ్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షించారు. రాష్ట్రపతి పర్యటనలో భాగంగా ఈ నెల 17 నుంచి 21 వరకు రాష్ట్రపతి హైదరాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో బస చేస్తారని సిఎస్ తెలిపారు. రాష్ట్రపతి పర్యటనకు సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని, తగు >>2

## ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అవగాహన తరగతులను బహిష్కరిస్తున్నాం: మాజీమంత్రి కేటీఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 10:** బుధవారం నుంచి జరిగే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అవగాహన తరగతులను బహిష్కరించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. ఈ మేరకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒక ప్రకటన విడుదల చేశారు. మా వాక్కులకు భంగం కలిగేలా స్పీకర్ వ్యవహరించారని కేటీఆర్ తెలిపారు. తొలిరోజే తమను లోపలికి రాకుండా అరెస్టు చేయించారని పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా సమస్యలు ఎత్తిచూపితే అరెస్టు చేశారని చెప్పారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అక్రమ పార్టీ ఫిరాయింపులపై నిర్ణయం తీసుకోకుండా స్పీకర్ నాన్చుడు ధోరణి అవలంబిస్తున్నారని కేటీఆర్ అన్నారు. గత అసెంబ్లీ సమావేశాల్లోనూ తమ గొంతు నొక్కేలా వ్యవహరించారని తెలిపారు. తమకు అవకాశం ఇవ్వకుండా స్పీకర్ ఏకపక్షంగా వ్యవహరించారని పేర్కొన్నారు. తమ శాసనసభ్యుల్లో అతి తక్కువ మంది మాత్రమే కొత్త వాళ్లు ఉన్నారని తెలిపారు. ఏకపక్షంగా వ్యవహరిస్తున్న స్పీకర్ వ్యవహారశైలికి నిరసనగా బుధవారం నుంచి జరగనున్న అవగాహన తరగతులను బహిష్కరిస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా పార్టీలకు అతీతంగా ఎలాంటి వివక్ష లేకుండా వ్యవహరించాలని స్పీకర్‌ను విజ్ఞప్తి చేశారు.

## అదనపుడిజి మహేష్ భగవత్‌ను కలిసిన మంచు మనోజ్ దంపతులు

### రక్షణ కల్పించాలని వేడుకోలు

**హైదరాబాద్, డిసెంబరు 10, ప్రభాతవార్త:** టాలీవుడ్ నటుడు మంచు మనోజ్ దంపతులు మంగళవారం సాయంత్రం అదనపు డిజి (శాంతి భద్రతలు) మహేష్ భగవత్ ను కలిశారు. రంగారెడ్డి జిల్లా జల్‌పల్లిలో గల మోహన్ బాబు ఫాం హౌజ్ వద్ద రెండు రోజులుగా జరుగుతున్న ఘర్షణలపై వారు ఈ సందర్భంగా అదనపు డిజిపికి వి వరించారని సమాచారం. మోహన్ బాబు, మనోజ్‌లు ఒకరిపై మరొకరు పరస్పరంగా పహాడిషరీఫ్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసుకోవడం విదితమే. ఈ నేపథ్యంలో ఇ రు వర్గాలపై పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేబట్టారు. మరోవైపు మంగళవారం ఉదయం జల్‌పల్లిలో గల మోహన్‌బాబు ఫాం హౌస్ వద్ద మనోజ్‌తోపాటు ఆయన సోదరుడు విష్ణుల తరపున అక్కడికి వచ్చిన బౌన్సర్ల మధ్య ఘర్షణ నెలకొంది. దీని తరువాత మనోజ్ దంపతులు అదనపు డిజి (శాంతి భద్రతలు) మహేష్ భగవత్‌ను కలిసి తనకు, తన కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు. తనకు గన్‌మెన్లకు వెంటనే సమకూర్చాలని కోరారు. అయితే ఈ విషయంలో రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్‌బాబును కలవాలని మనోజ్ దంపతులను మహేష్ భగవత్ కోరారు.



మహాత్మాజ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.

## ప్రజల ఇబ్బందులను నేరుగా చెప్పుకునేందుకు ప్రజావాణి

### ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్ (బేగంపేట) డిసెంబరు 10, ప్రభాతవార్త :** ప్రజల ఇబ్బందులను నేరుగా చెప్పుకునేందుకు ప్రభుత్వం ప్రజావాణీ ఏర్పాటు చేసిందని, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ప్రజావాణీ ఏర్పాటు చేసి ఏడాది పూర్తయిన సందర్భంగా మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఎన్ని ఇబ్బందులు వచ్చినా ప్రజావాణీని కొనసాగిస్తామని అన్నారు. పోడు సాగుకు సోలార్ పవర్‌ను అందించనున్నట్లు ఆయన తెలియజేసారు. ప్రజావాణీ దరఖాస్తులకు పరిష్కారం దొరికిందని, ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ప్రజలకు జవాబు దారిగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ప్రభుత్వంలో ఉన్న అన్ని వ్యవస్థలు ప్రజల కోసమే పనిచేస్తున్నాయన్నారు. గత పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ సర్కార్ పోడు రైతుల సమస్యలను పట్టించుకోలేదని ఉప ముఖ్యమంత్రి ఆరోపించారు. తెలంగాణా ప్రజల ఆశలు, ఆకాంక్షలను వారు విస్మరించారని అన్నారు. ప్రభుత్వంలో ఉన్న అన్ని వ్యవస్థలు ప్రజల కోసమే పనిచేస్తున్నాయి అన్న భావన ప్రజల్లో కలిగించినప్పుడే ప్రజాస్వామ్యానికి పునాదులు వేసిన వారం అవుతామన్నారు. భారత రాజ్యాంగంలోని ప్రియాంబుల్స్‌లో పేర్కొన్న ప్రతి ఒక్కటీ ప్రజలకు అందించే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని తమ ప్రభుత్వం పనిచేస్తుందని మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఈ సందర్భంగా ప్రజల అభిప్రాయాలను ఆయన అడిగి తెల్సుకున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా. జి. చిన్నారెడ్డి, దివ్య తదితరులు పాల్గొన్నారు.



## పెండింగ్‌లో ఉన్న ఫీజుల బకాయిలను వెంటనే చెల్లించాలి

### మినిస్టర్ క్వార్టర్స్ ముట్టడికి బిసి విద్యార్థి సంఘం యత్నం

### అడ్డుకున్న పోలీసులు.. అరెస్ట్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలింపు

**హైదరాబాద్, డిసెంబరు 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వివిధ డిగ్రీ, పిజి కోర్సుల్లో చదువుతున్న 15లక్షల మంది విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో వందలాది మంది విద్యార్థులు బంజారాహిల్స్‌లోని మంత్రుల నివాస సముదాయాన్ని ముట్టడించారు. ఈసందర్భంగా ప్రభుత్వం వెంటనే ఫీజులు బకాయిలు చెల్లించాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ప్రధాన ద్వారంవైపు దూసుకొస్తున్న విద్యార్థులను పోలీసులు అడ్డుకోవడంతో ఒక్కసారిగా తోపులాట జరిగింది. దీంతో విద్యార్థి నేతలు అరెస్ట్ చేసి బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు వేములరామకృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో విద్యార్థులు ఫీజుల బకాయిలు చెల్లించకుండా విజయోత్సవాలు జరపడమేంటని ప్రశ్నించారు. ప్రభుత్వంలోని కొందరు అధికారులు ఫీజుల రియంబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేయడానికి కుట్రలు చేస్తున్నారని.. గత నాలుగు నెలలుగా విద్యార్థుల రోడ్లపైకి వచ్చి ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం తీరు ఇలానే ఉంటే అన్ని విద్యార్థి సంఘాలు, ప్రజాసంఘాలతో కలిసి నిరవదిక బంద్ చేస్తామని రామకృష్ణ హెచ్చరించారు.

# వ్యవసాయ సహకార సంఘాలు బలోపేతం

### సబ్సిడీపై రైతులకు యంత్రాలు

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, డిసెంబరు 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను బలోపేతం చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ వ్యవసాయ సహకార పరపతి సంఘాల వనితీరు మెరుగుపర్చే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ సచివాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఎక్కువ మంది రైతులకు సహకార సంఘాల సేవలు చేరదీసేలా నిర్దిష్టమైన ప్రణాళికను రూపొందించి ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. అలాగే ఈ యాసంగి నుండి యాంత్రీకరణ పథకాన్ని త్వరితగతిన అమలు చేయాలని చెప్పారు. తద్వారా రైతులకు నాణ్యమైన పనిముట్లు, యంత్రాలను సబ్సిడీపై సరఫరా చేయాలని తెలియచేశారు. కాగా కేంద్ర ప్రభుత్వ పథకాల క్రింద విడుదలయ్యే నిధులను పూర్తిగా వినియోగించుకోనేటందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వము మ్యాచింగ్ గ్రాంటు నిధులను విడుదల చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతీ పైసా తెలంగాణ రైతు సంక్షేమానికి ఉపయోగపడే విధంగా చూడాలన్నారు. పత్తి కొనుగోళ్లు మరో రెండు నెలల పాటు సజావుగా జరిగేటట్లు చూడాలని ఆదేశించారు. ఇప్పటిదాకా 8,59,272.68 మెట్రిక్ టన్నుల పత్తిని 3,56,633 మంది రైతుల నుండి మద్దతు ధరతో సేకరించినట్లు చెప్పారు. కాగా ఉద్యానపంటల కోసం సబ్సీడిపై డ్రిప్ పరికరాలు మరియు స్ప్రింక్లర్లు అందించాలన్నారు. ఇందుకోసం 90 రోజుల పాటు రైతులనుండి దరఖాస్తులు స్వీకరించి, రోజు కోటి విలువైన డ్రిప్ పరికరాలు అందించాలని చెప్పారు. అన్ని ఉద్యానపంటలకు డ్రిప్ మరియు స్ప్రింక్లర్ పరికరాలను సబ్సిడీపై అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 2.31 లక్షల ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు చేపట్టడం జరిగిందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నేటి వరకు 28 వేల ఎకరాలలో సాగు లక్ష్యాన్ని పూర్తి చేయడం జరిగిందని పేర్కొన్నారు. మార్చికల్లా లక్ష ఎకరాలకు పైగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ పూర్తి చేయాలని తెలిపారు. తక్కువ పురోగతి ఉన్న కంపెనీలపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ సెక్రటరీ రఘునందన్ రావు, డైరెక్టర్ గోపి, మార్కెటింగ్ డైరెక్టర్ ఉదయ్ కుమార్, హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా పాల్గొన్నారు.



## కుటుంబసభ్యులతో జైపూర్ వెళ్లిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 10:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూడు రోజులపాటు ఢిల్లీ, జైపూర్‌లో పర్యటించనున్నారు. మంగళవారం సాయంత్రం జైపూర్‌కు వెళ్లారు. తన బంధువులకు సంబంధించిన శుభకార్యం ఉండటంతో తన కుటుంబ సభ్యులతో కలిసి సిఎం జైపూర్‌కు బయలుదేరి వెళ్లారు. శుభకార్యం అనంతరం ఢిల్లీకి వెళ్లనున్నారు. కాగా, రెండు రోజుల పాటు సిఎం ఢిల్లీలో పర్యటించనున్నారు. ఉండనున్నారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నందున కేంద్ర మంత్రులు ఢిల్లీలో అందుబాటులో ఉంటారు. దీంతో పలువురు మంత్రులను కలిసేందుకు అపాయిమెంట్ తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆయా శాఖల నుంచి వివిధ పథకాలు, గ్రాంట్ల కింద రాష్ట్రానికి రావాల్సి న నిధుల విడుదల చేయాలని కేంద్రమంత్రులకు విజ్ఞప్తి చేసే అవకాశం ఉంది. మూడు రోజుల పర్యటనలో ఏఐసీసీ పెద్దలను సీఎం రేవంత్ కలిసే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పీసీసీ కార్యవర్గం రూపకల్పనపై చర్చించే అవకాశం ఉంది. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జీ దీప దాస్‌మున్షీలు కూడా ఢిల్లీలో అందుబాటులో ఉండాల్సి ఉంటుంది. రాష్ట్రానికి సంబంధించిన ఏ విషయంలో నిర్ణయం తీసుకోవాలన్న ఈ కోర్ కమిటీ సమావేశం తప్పనిసరని పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. పార్టీకి విధేయులుగా ఉండే నేతలకు కార్యనిర్వాహక అధ్యక్షులు, సీనియర్ ఉపాధ్యక్షుల పదవులు ఇవ్వాలని భావిస్తున్నారు. సామాజిక సమీకరణాలు కుదరకపోవడం, మంత్రి పదవులకు ఎక్కువ పోటీ ఉండడంతో ముందుకు పోలేని పరిస్థితులు నెలకొన్నట్లు పీసీసీ వర్గాలు చెబుతున్నాయి. నామినేటెడ్ పదవులు 25వరకు భర్తీ చేసేందుకు ఆశావహుల పేర్లతో జాబితా సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి గతంలోనూ మొదటి విడతలో ఇచ్చిన నామినేటెడ్ పోస్టులు ఓ వర్గానికి అధికంగా ఇచ్చినట్లు విమర్శలు వెల్లువెత్తాయి. ఈసారి అలాంటి పరిస్థితులు ఎదురు కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

## డిసిఎం భట్టితో అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ విసి ఘంటా చక్రపాణి భేటీ

**హైదరాబాద్, డిసెంబరు 10, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఏకైక సార్వత్రిక విశ్వవిద్యాలయం అయిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఉప కులపతి(వీసీ) ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి మంగళవారం ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిశారు. ఈ నెల 6న ఘంటా చక్రపాణిని అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ వీసీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీగా అదే రోజు సాయంత్రం ఆయన బాధ్యతలు తీసుకున్నారు. మూడేళ్లపాటు ఘంటా చక్రపాణి యూనివర్సిటీ వీసీగా కొనసాగనున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి అయిన మల్లు భట్టివిక్రమార్కను మంగళవారం కలిశారు. కేవలం మర్యాద పూర్వకంగానే కలిసినట్టు యూనివర్సిటీ వర్గాలు ప్రకటించాయి. భేటీ సందర్భంగా యూనివర్సిటీకి సంబంధించిన అంశాలను డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లినట్టు తెలుస్తోంది.

## కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలి

### రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌కు బిఆర్ఎస్ నేతలు వినయ్ భాస్కర్, రవిచంద్ర వినతి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 10:** కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ నాయకుడు దాస్యం వినయ్ భాస్కర్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఢిల్లీలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఇతర నాయకులు వెంటరాగా తీసుకుని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిశారు. కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు, రైల్వే డివిజన్ ఇతర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని రైల్వే శాఖ మంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ..60 ఏళ్ల స్వరాష్ట్ర స్వప్నం ఎలాగో, 40 ఏళ్ల కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజల కల అని తెలిపారు. నాడు ఉద్యమ సమయంలో శ్రీకృష్ణ కమిటీకి కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని వినతిపత్రాలు ఇచ్చామని దాస్యం వినయ్ భాస్కర్ గుర్తుచేశారు. నాటి ఉద్యమ నేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, నాటి పార్లమెంట్ సభ్యులు, మేము కలిసి విభజన చట్టంలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు, ట్రైబల్ యూనివర్సిటీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని ఒత్తిడి చేసిన విషయాన్ని తెలిపారు. న్యాయంగా కాజీపేటకు రావాల్సి న కోచ్ ఫ్యాక్టరీ పలు రాష్ట్రాలకు తరలిపోయిన తీరును వివరించారు.

వివిధ దశల్లో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం వచ్చిన ఉద్యమ శక్తులతో కలిసి చేసిన పోరాటాన్ని, కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు ఆవశ్యకతను వివరించారు. కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు కావాల్సి న స్థలాన్ని సైతం కేసీఆర్ హయాంలోనే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి అప్పగించిందని దాస్యం వినయ్ భాస్కర్ గుర్తు చేశారు. కాజీపేట రైల్వే జంక్షన్‌ను డివిజన్ స్థాయికి త్వరితగతిన అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. కాజీపేట రైల్వే స్టేషన్‌లో కొన్ని రైళ్లు హాల్ట్ జరగాలని, ప్లాట్‌ఫామ్‌లు పెంచాలని, ఎక్కువ బడ్జెట్ కేటాయించాలని కోరారు. వరంగల్‌లో ఉన్న రైల్వే స్టేడియాన్ని అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు.

కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు ప్రకటనను స్వాగతిస్తున్నామని తెలిపారు. ప్రజల అభీష్టాన్ని అర్థం చేసుకున్నందుకు కృతజ్ఞతలు తెలుపుతూ.. కోచ్ ఫ్యాక్టరీ, డివిజన్ ఏర్పాటును సాధ్యమైనంత త్వరగా చేపట్టాలని కోరారు. 60 శాతం ఉద్యోగాలు స్థానికులకు ఇవ్వాలన్నారు. కాజీపేట ఐటీఐ కాలేజీ విద్యార్థులకు స్థానికంగా అప్రెంటిషిప్ కల్పించాలని కోరారు. చిరువ్యాపారులకు వెండింగ్ జోన్లు ఏర్పాటు చేయాలని, బోడగుట్ట ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టాలని డిమాండ్ చేశారు. నిర్మాణంలో ఉన్న ఫాతిమా బ్రిడ్జి త్వరగా పూర్తి అయ్యేలా రైల్వే శాఖ చర్యలు తీసుకోవాలని కోరారు. రైల్వే సమన్వయం, ఇతర సహకారం అందించాలని కోరారు.

## సంక్షేమ గురుకులాల్లో ఫిబ్రవరి 23న ఎంట్రన్స్ టెస్ట్

### విద్యాలయాల్లో అనుమతి లేకుండా ప్రవేశిస్తే పోలీసు కేసు

### గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి వర్షిణి

**హైదరాబాద్, డిసెంబరు 10, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బిసి, సాధారణ గురుకుల విద్యాలయాల్లో 2025 -26 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశాలకు మరో ఎనిమిది రోజుల్లో నోటిఫికేషన్ విడుదల కానుంది. దీనికి సంబంధించి ఈ నెల 18వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు గురుకుల సొసైటీ కార్యదర్శి, ఉమ్మడి ప్రవేశ పరీక్ష కన్వీనర్ వర్షిణి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో ఈ మేరకు గురుకుల ప్రవేశాల నోటిఫికేషన్ జారీచేయ నున్నట్లు ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి, ఉమ్మడి ప్రవేశ పరీక్ష కన్వీనర్ వర్షిణి ఓ ప్రకటనలో తెలిపారు.

2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి గురుకుల ప్రవేశాలు మే 15వ తేదీ నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. పదో తరగతి పాసైన ఎస్సీ గురుకుల సొసైటీ విద్యార్థులకు సొసైటీ పరిధిలోని జూనియర్ కళాశాలల్లో ఎలాంటి ప్రవేశ పరీక్షలేకుండానే నేరుగా ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు.

ఉమ్మడి ప్రవేశపరీక్ష దరఖాస్తు, సొసైటీల వారీగా సీట్ల కేటాయింపు మరింత సరళీకృతం చేశామని వివరించారు. ఈ మేరకు సంక్షేమ భవన్‌లోని సొసైటీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల తెలంగాణ రాష్ట్రంలోని పలు గురుకుల విద్యాలయాల్లో ఫుడ్ పాయిజన్ సంఘటనలపై స్పందిస్తూ గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ తరహా ఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. సరకుల నిల్వ డబ్బాలు కొనేందుకు గురుకుల పాఠశాలకు రూ.20 వేల చొప్పున కేటాయించామని, గురుకుల పాఠశాలలు, కళాశాలల్లోకి అనుమతి లేకుండా బయటి వారు ఎవరైనా ప్రవేశిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అటువంటి వారిపై పోలీసు కేసులు నమోదు చేస్తామన్నారు. విద్యార్థులకు కొత్త మెనూ త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. రాజకీయాల కోసం గురుకుల విద్యా సంస్థలను వాడుకోవద్దని సూచిస్తున్నామని వర్షిణి హితవు పలికారు.

## ఎన్‌హెచ్ 30పై కారు దగ్ధం

>> ఘటనలు జరగకుండా డిశంబర్1నుంచే జాతీయ రహదారి యన్.హెచ్.30పై రాత్రి సమయంలో రాకపోకలను పోలీసులు పూర్తి స్థాయిలో నిలిపివేశారు. ఎటపాక మండలం నెల్లిపాక వద్ద పోలీసులు, సిఆర్‌పియఫ్ బలగాలు విధులు నిర్వహిస్తూ భద్రాచలం వైపు నుంచి చింతూరు వచ్చే అన్ని వాహనాలను వయా కూనవరం వైపుగా మళ్ళిస్తున్నారు. చింతూరు మండలం చట్టి సమీపంలో కూనవరం జంక్షన్ వద్ద చింతూరు పోలీసులు పోలీస్ పికెట్ ఏర్పాటు చేసి చింతూరు వైపు నుండి జాతీయ రహదారిపై భద్రాచలం వైపు వెళ్ళే అన్ని వాహనాలను కూనవరం మీదుగా భద్రాచలం వెళ్ళవలసిందిగా సూచిస్తున్నారు. రాత్రి సమయంలో తిరిగే అన్ని బస్సు సర్వేసులను నిలిపివేశారు. అయినా చింతూరు మండలం సర్వేల వద్ద మావోయిస్టులు కారును దగ్ధం చేయటం, ఘటన స్థలం వద్ద ఎటువంటి లేక దొరకకపోవటం, కారుకు సంబంధించి ఏ వ్యక్తులు కూడా ఇప్పటి వరకు ఎటువంటి సమాచారం తెలియకపోవటం, ఘటన స్థలంలో కారు డీజిల్ ట్యాంక్ మూత తీసి అందులో డీజిల్‌తో కారును దగ్ధం చేసినట్టు స్పష్టం అవుతుంది. కారులోకి రోడ్డు ప్రక్కన ఉండే మొద్దులు వేసి కారును దగ్ధం చేయటం సంచలనంగా మారింది. కారుకు సంబంధించిన ఎటువంటి ఆనవాళ్ళు అక్కడ లభించలేదు. మావోయిస్టుల పనే అయితె గత ఏడాది డిశంబర్ 20న ఇదే జాతీయ రహదారిపై వీరాపురం వద్ద కారును దగ్ధం చేసిన మావోయిస్టులు కరపత్రాలను ఆ ప్రాంతంలో వెదజల్లారు. కాని సర్వేల వద్ద జరిగిన ఘటన స్థలంలో ఎటువంటి ఆనవాళ్ళు లభించలేదు. కారు నెంబర్ కాని, ఎటువంటి వివరాలు లేకపోవటంతో పోలీసులు ఇంజన్ నెంబర్ సహాయంతో చిరునామా తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. చింతూరు వైపు నుంచి భద్రాచలం వెళ్ళే వాహనాలు జాతీయ రహదారిపై వెళ్ళకుండా ,కూనవరం మీదుగా వెళ్ళలని సూచిస్తున్నా ఈ ప్రాంతంలో రహస్య రహదారులపై అవగాహన ఉన్న కొందరు చట్టి వద్ద రెడ్‌క్రాస్ భవనం వెనకవైపు నుంచి ఉన్న రోడ్డు మీదుగా జాతీయ రహదారిపైకి సింగనగూడెం వద్ద ప్రవేసిస్తున్నారు. మరో రహదారి ఛత్తీస్‌ఘడ్‌లోని కుంటకు సమీపంలో ఉన్న చిడుమూరు మీదుగా వయా బుర్కనకోట నుండి జాతీయ రహదారి మీదకు వచ్చి భద్రాచలం వైపు వెళ్ళుతున్నారు. ఈ రెండు మార్గాల్లో వెళ్ళే వాళ్ళు పోలీసుల ఆదేశాలను దిక్కరించి ,కూనవరం మీదుగా వెళ్ళలేక, పోలీసుల కూనవరం చెక్‌పాయింట్‌కు సంబంధం లేని ప్రాంతం నుంచి ప్రయాణిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఈ ఘటన చోటుచేసుకుంది. కారులో ప్రయాణిస్తున్న వ్యక్తులు ఎంతమంది. వాళ్ళు ఎక్కడ ఉన్నారు. భయంతో పారిపోయారా లేక కారును దగ్ధం చేసిన మావోయిస్టులు వారిని అపహరించారా?, కారు ఇన్సురెన్స్ కోసం ఏమైనా కారుకు సంబంధించిన వ్యక్తులే ఏమైనా దగ్ధం చేశారా? అనే అనుమానాలతో అనేక కోణాల్లో పోలీసులు కూపిలాగుతున్నారు. ఈ ఘటన చింతూరు పరిసర ప్రాంతాలుల్లో ఉలిక్కి పడేలా చేసింది. పోలీసు బలగాలు హై అలర్ట్ ప్రకటించాయి. సాయంత్రం 5గం॥లనుంచే జాతీయ రహదారిపై వాహనాలు వెళ్ళకుండా నిలిపివేశారు. నిత్యం వందలాది వాహనాలతో కళకళలాడే జాతీయ రహదారిపై ఒక్క వాహనం కూడా లేకపోవటంతో నిశబ్ద వాతవరణం నెలకొంది. ఇది తాజా పరిస్దితి.

## ఇది తల్లి రుణం తీర్చుకున్న తరుణం

### సిఎం ఆసక్తికర ట్వీట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 10:** ఇది తల్లి రుణం తీర్చుకున్న తరుణం అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ట్వీట్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటును సోమవారం పూర్తి చేసింది. కాంగ్రెస్ ఏడాది పాలన ఉత్సవాల్లో భాగంగా... చివరి రోజు విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులతో పాటు ప్రజలు కూడా పెద్ద ఎత్తున హాజరయ్యారు. దీనిపై సిఎం రేవంత్‌రెడ్డి ట్వీట్ వేదికగా స్పందిస్తూ... పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా విగ్రహావిష్కరణ కార్యక్రమానికి సంబంధించిన ఫోటోలను షేర్ చేశారు. దీనిపై 'నాలుగు కోట్ల ప్రజల మనోఫలకాలపై నిండైన రూపంగా నిన్నటి వరకు నిలిచిన తెలంగాణ తల్లి... నేడు సచివాలయ నడిబొడ్డున నిజమై రూపంగా అవతరించిన శుభ సందర్భం' అని తెలిపారు. అంతేగాక ఇది తల్లి రుణం తీసుకున్న తరుణం అని సిఎం ఎక్స్ వేదికగా తెలిపారు.

## సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసు విభాగానికి డిఎస్‌సిఐ ఎక్సెలెన్స్ అవార్డు

**హైదరాబాద్, డిసెంబరు 10, ప్రభాతవార్త:** సైబర్ నేరాల నివారణ, నేరగాళ్ల అరెస్టుతో పాటు బాధితులకు చేయూత నందించడంలో విశేష కృషి చేసినందుకు సైబరా బా ద్ సైబర్ క్రైం పోలీసు విభాగానికి ప్రతిష్టాత్మకమైన డాటా సెక్యూరిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (డిఎస్‌సిఐ) ఎక్సెలెన్స్ అవార్డు లభించింది. దేశ రాజధాని ఢిల్లీలో నాస్కాం వార్షిక సమాచార భద్రత సమిట్‌లో ఈ అవార్డును సైబరాబాద్ క్రైమ్స్ డిసిపి శ్రీబాల అందుకున్నారు. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాష్ మొహంతి, సైబర్ క్రైమ్స్ డిసిపి శ్రీబాలను మంగళవారం తన కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో అభినందించారు. రాష్ట్ర పోలీసు శాఖకు అనుబంధంగా వున్న సైబరాబాద్ పోలీసు విభాగంలో ఉప విభాగంగా వున్న సైబరాబాద్ క్రైమ్స్ విభాగం గడచిన కొంతకాలంగా సైబర్ నేరాల నివారణలో మంచి ఫలితాలను అందుకుంది. ఇదే సమయంలో నేరగాళ్లను పట్టుకుని కోట్లాది రూపాయలను వారి నుంచి జప్తు చేసి బాధితులకు అందజేసింది. ఈ సందర్భంగా అవినాష్ మొహంతి మాట్లాడుతూ సైబరాబాద్ సైబర్ క్రైం విభాగం భవిష్యత్తులో మరిన్ని మంచి ఫలితాలను సాధించాలని కోరారు.


డిఎస్‌సిఐ ఎక్సెలెన్స్ అవార్డుతో కమిషనర్ అవినాష్ మొహంతి, సైబర్ క్రైమ్స్ డిసిపి శ్రీబాల

## యుజిసి నిబంధనల ప్రకారం పేస్కేల్ అమలు చేయాలి

### రాష్ట్ర విశ్వవిద్యాలయాల కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం

**హైదరాబాద్, డిసెంబరు 10,ప్రభాతవార్త:** 20 ఏళ్లుగా విశ్వవిద్యాలయాల నమ్ముకుని విద్యార్థులకు విద్యనందిస్తూ చాలీచాలని వేతనాలతో విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులకు యూజీసీ నిబంధనల ప్రకారం వెంటనే పేస్కేల్ అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయాల కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం డిమాండ్ చేసింది. ఈమేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అధ్యాపకులు డాక్టర్ ఒధర్మతేజ, డా. ఉపేందర్, డా. శ్రీధర్‌రెడ్డి, రవీందర్‌గౌడ్‌లు మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల్లో గత 15 సంవత్సరాల నుండి అధ్యాపక నియామకాలు లేకపోవడంతో కాంట్రాక్ట్ వ్యవస్థలో పనిచేస్తూ వస్తున్నామన్నారు. అన్ని అర్హతలు ఉన్నా యూజీసీ పై స్కేల్స్ అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. సుప్రీం కోర్ట్ గతంలో ఇచ్చిన జడ్జిమెంట్ ఆధారంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని..పర్మినెంట్ అధ్యాపకులు ఏ విధంగా నియమించబడ్డారో అదే పద్ధతిలో నియమించబడిన కాంట్రాక్ట్ అధ్యాపకులను చాలీచాలని వేతనాలతో ఇబ్బంది పెట్టటం సరికాదన్నారు.

## మణికొండ మున్సిపల్ కార్యాలయంలో ఎసిబి సోదాలు

**హైదరాబాద్ (నార్సింగి), డిసెంబరు 10, ప్రభాతవార్త :** మణికొండ మున్సిపల్ కార్యాలయంపై మంగళవారం ఏసీబీ అధికారులు సోదాలు చేశారు. గతంలో ఈ మున్సిపల్‌లో డిఇగా పని చేసిన దివ్యజ్యోతిపై అవినీతి ఆరోపణలున్నాయి. స్వయంగా ఆమె భర్తనే తన భార్య కాంట్రాక్టర్ల నుంచి లంచంగా తీసుకున్న డబ్బులు తన ఇంట్లో బెడ్ కింద, చెత్త బుట్టలు, అల్మార, దేవుడి ఫోటోల వెనుకాల పెట్టిన నోట్ల కట్టల వీడియోలను సోషల్ మీడియాతో పాటు ప్రసార సాధనాలు, పాత్రికేయులకు ఇచ్చారు. నా భార్య అవినీతి సొమ్ముతో నా కుమారుడిని పెంచుతూ నానుంచి దూరం చేస్తుందని, ఆమెపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. భర్త విడుదల చేసిన నోట్ల కట్టల వీడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేయడంతో ఆమె మణికొండ నుంచి జిహెచ్ఎంసికి బదిలీ చేయించుకుంది. ఈ విషయంపై ఏసీబీ అధికారులు దృష్టి సారించారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం మణికొండ కార్యాలయంకు వచ్చి ఆమె సంతకాలు పెట్టిన ఫైళ్లన్నింటిని ఏసీబీ కార్యాలయంకు తీసుకెళ్లారు. ఫైళ్లన్నింటిని పరిశీలించిన తరువాత చట్ట పరిధిలో చర్యలు తీసుకుంటామని ఏబీసీ అధికారులు స్పష్టం చేశారు.

## ఈశ్రమ్ పోర్టల్‌లో నమోదయిన అందరికీ రేషన్‌కార్డులు: సుప్రీం బెంచ్

**న్యూఢిల్లీ, డిసెంబరు 10:** అసంఘటిత రంగంలోపనిచేస్తూ కేంద్రప్రభుత్వం ప్రారంభించిన ఈశ్రమ్‌పోర్టల్‌లో రిజిస్టరు అయిన కార్మికులందరికీ రేషన్‌కార్డులు వెంటనే పంపిణీచేయాలని సుప్రీం బెంచ్ ఆదేశాలు జారీచేసింది. రాజ్యాంగంలోని 21వ అధికరణం ప్రకారం ప్రాథమిక హక్కు, జీవితపరిరక్షణ, వ్యక్తిగత స్వేచ్ఛ ఏకపక్షంగా అణిచివేతకు వ్యతిరేకంగా ఉన్న వారి హక్కులను ఉల్లంఘించడానికి వీలులేదని సుప్రీం బెంచ్ అభిప్రాయపడింది. అలాగేజాతీయ ఆహారభద్రతా చట్టం పరిధిలో ఇప్పటివరకూ కవర్‌కాని వారికి కూడా రేషన్‌కార్డులు అందించాలని ఆదేశించింది. ఈశ్రమ్ పోర్టల్‌లో ఇప్పటివరకూ 28.6 కోట్లమంది రిజిస్టరు అయి ఉన్నారని, వారిలో 20.63 కోట్లమంది వలస కార్మికులు రేషన్‌కార్డులకోసం దరఖాస్తుచేసకున్నట్లు సుప్రీం గుర్తించింది. మిగిలిన వారికి రేషన్‌కార్డులు లేకపోవడంవల్ల వివిధప్రభుత్వ పథకాలు అందడంలేదని, జాతీయ ఆహారభద్రతా పథకం వారికి అందడంలేదని వారికిరేషన్‌కార్డులేకపోవడమే ఇందుకుకారణమని సుప్రీం న్యాయమూర్తులు పేర్కొన్నారు.

